క్లుప్తంగా

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



పదో తరగతి విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ

బలిజిపేట: పదో తరగతి విద్యార్థులలో మంచి ప్రగతి సాధించాలంటే వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ–1 సామల సింహాచలం సూచించారు. బలిజిపేట ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను, సబ్జెక్టుల వారీగా వారి ప్రగతిని పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారు అన్ని సబ్జెక్టులలో ప్రగతి సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. ఆయన వెంట హెచ్‌ఎం పి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇంకుడు గుంతల పరిశీలన



ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న ఈఏ సంతోష్‌కుమార్

సీతానగరం: మండలంలో పెదబోగిలి 1,2 సచివాలయాల పరిధిలో ఉన్న చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాల పరిసరాల్లో చేపట్టిన ఇంకుడు గుంతల పనులు వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ సహాయకుడు సంతోష్‌కుమార్ అన్నారు. స్థానిక ఎస్‌డబ్ల్యూపీసీ ఆవరణలో సర్పంచ్ జే తేరేజమ్మ ధ్వర్యంలో చేపడుతున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు గ్రామాల్లో ఇంకుడు గుంతలు తవ్విస్తున్నట్లు చెప్పారు. అలాగే పెదబోగిలి పంచాయతీలో సీసీ కాలువలు, సీసీ రోడ్డు పనులు చేపట్టినట్లు చెప్పారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి



బలిజిపేటలో సోఫ్‌పిట్‌కు శంకుస్థాపన చేస్తున్న జడ్పీటీసీ రవికుమార్

బలిజిపేట: మండలంలో గుర్తించిన అభివృద్ధి పనులు ప్రతిపాదనలకు మాత్రమే పరిమితం కాకుండా త్వరగా పూర్తిచేయించి ప్రజలకు మేలు జరిగేవిధంగా చూడాలని జడ్పీటీసీ రవి కుమార్ అన్నారు. చిలకలపల్లి, పలగర, బలిజిపేట, తుమరాడ, వెంగాపురం గ్రామాల్లో మంగళవారం 'పల్లె పండగ' కార్యక్రమాన్ని నిర్వహించారు. బలిజిపేట సచివాలయం వద్ద జడ్పీటీసీ రవికుమార్ సోఫ్‌పిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, పీఆర్ ఏఈ అంబేడ్కర్, ఏపీఓ కేశవరావు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

పుస్తకాలు, పెన్నుల పంపిణీ



అందుకున్న పుస్తకాలతో విద్యార్థులు

పార్వతీపురం: మండలంలోని జోకిశీల పంచాయతీ తేలునాయుడువలస ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆంగ్లం, నోట్‌బుక్స్, పెన్నులను పార్వతీపురం టౌన్ పోలీస్ స్టేషన్ వృద్ధ మిత్ర కోఆర్డినేటర్ కె.కృష్ణమూర్తి అందజేసినట్లు హెచ్‌ఎం వి.వెంకటరావు తెలిపారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం 93వ జయంతి సందర్భంగా మంగళవారం నాడు వాటిని విద్యార్థులకు అందజేశారు. అలాగే గ్రామంలోని వృద్ధులకు, దివ్యాంగులకు రగ్గులను అందజేశారు.

ఇంగువ ద్రావణం తయారీపై అవగాహన



ద్రావణం తయారీపై అవగాహన కల్పిస్తున్న ఎంసీఆర్పీ లక్ష్మి

బలిజిపేట: పుల్లటి మజ్జిగ, ఇంగువ ద్రావణం తయారీపై మిర్తివలస బయోమెట్రిక్ ఇన్‌పుట్ సెంటర్ వద్ద రైతులకు ఐసీఆర్పీ లక్ష్మి, తిరుపతిరావు మంగళవారం అవగాహన కల్పించారు. మూడు రోజుల పాటు బాగా పులిసిన ఒక లీటరు పెరుగుకు మూడు లీటర్ల నీరు చొప్పున కలుపుకొని మజ్జిగ చేసుకోవాలి. ఇలా తయారైన మజ్జిగను 100లీటర్ల నీటికి 6లీటర్ల వంతున వేసుకుని 150 గ్రాముల ముద్ద ఇంగువను కరగదీసి ద్రావణంలో వేసుకోవాలి. ఈ ద్రావణాన్ని అన్ని రకాల పైరులు, పండ్ల తోటల్లో స్ప్రే చేసినట్లయితే మొక్కలకు కావాల్సిన నత్రజని లభించడంతో పాటు ఆకుమచ్చ, కాయమచ్చ, బూజు తెగుళ్లు నివారించవచ్చని తెలిపారు. దీంతో పాటు పువ్వు, పిందె రాలకుండా కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి కుదేల్

- పెరిగిన నిత్యావసరాల ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు బెంబేలు
- ల్యాండ్, శాండ్, వైన్, మైన్స్‌లో కూటమి ఎమ్మెల్యేల పెత్తనం
- గిరిజన సమస్యలపై స్పందించని మంత్రి
- గత ప్రభుత్వంలో మంజూరైన పనులకే నేడు పల్లెపండగ పేరుతో శంకుస్థాపనలు
- ఐటీడీఏ డీడీ సరెండర్ వెనుక ఆంతర్యం ఏమిటి?
- ప్రభుత్వాన్ని నిలదీసిన మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: టీడీపీ కూటమి పాలనలో ఓ వైపు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటడంతో అన్ని వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా టీడీపీ కూటమి ప్రభుత్వం మరోసారి ప్రజలను మోసం చేస్తోందని మాజీ డిప్యూటీ సీఎం, మాజీ గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలో తన స్వగృహంలో మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ ప్రభుత్వంలో పేద, మధ్య తరగతి కుటుంబాలు కొనుగోలు చేయలేనంతగా నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయాయని అన్నారు. గత ప్రభుత్వంలో నిత్యావసర సరుకుల ధరలు కొద్దిగా పెరిగితే నానాయాగి చేసిన ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు దీనిపై ఏం సమాధానం చెపుతారని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు దాటుతున్నా సూపర్ సిక్స్ హామీలు ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు.

• శాండ్, ల్యాండ్, వైన్, మైన్స్‌లో దోపిడీ..

శాండ్, ల్యాండ్, వైన్, మైన్స్‌లో కూటమి ఎమ్మెల్యేలు దోపిడీకి తెరతీశారని వారి అనుకూల మీడియాలోనే కథనాలు వస్తున్నాయన్నారు. లాటరీ ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు జరగగా.. దాదాపు అన్నీ టీడీపీ నేతలకే దక్కడం గమనార్హమన్నారు. ఎన్నికల సమయంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై దుష్ప్రచారం చేసి జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలు ఉండడాన్ని తప్పుపట్టిన కూటమినాయకులు నేడు 1బీలలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రెవెన్యూశాఖ మంత్రి ఫొటోలు ఎందుకు ముద్రిస్తున్నారని ప్రశ్నించారు.

• వర్క్ ఆర్డర్లు లేకుండా శంకుస్థాపనలా?

ఈ ప్రభుత్వంలో ఉపాధిహామీ పథకం ద్వారా సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లో ఒక్క రుపాయి కూడా మంజూరు చేయకుండా గత ప్రభుత్వంలో మంజూరైన పనులకు నేడు శంకుస్థాపనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వర్క్ ఆర్డర్లు ఇవ్వకుండా శంకుస్థాపనలు ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో వందల కోట్ల రుపాయలతో అభివృద్ధి పనులు మంజూరు చేశామని వివరించారు. గత ప్రభుత్వంలో మంజూరైన మక్కువ రోడ్డు, శివరాంపురం, సారిక వంతెనలు, ఇతర అభివృద్ధి పనులను ఈ ప్రభుత్వం ఎందుకు ముందుకు తీసుకెళ్లడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఆయా పనులపై రాజకీయ విమర్శలు చేసి లబ్ధి పొందిన ప్రస్తుత మంత్రి సంధ్యారాణి ఈ పనులు త్వరితగతిన పూర్తిచేసేందుకు ఎందుకు చొరవ తీసుకోవడం లేదని నిలదీశారు.

• మంత్రి హామీలు అమలయ్యేదెప్పుడు?

మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సంధ్యారాణి రాష్ట్రంలోని ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంల నియామకంపై తొలి సంతకం చేశారని, కానీ నేటికీ ఏఎన్‌ఎంల భర్తీకి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం మంత్రి సంతకానికి ఉన్న విలువ, హామీల అమలులో మంత్రికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. గతంలో తాను గిరిజన సంక్షేమశాఖా మంత్రిగా ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంల నియామకానికి సంబంధించి ఫైల్ పెట్టామని, ఆ ఫైల్ సీఎంఓలో ఉందని, మంత్రి సంధ్యారాణి దాన్ని తెప్పించుకుని పరిశీలించాలని సూచించారు. పట్టణంలో సామాజిక మరుగుదొడ్ల మరమ్మతులు, తాగునీటి సదుపాయం, తదితర పనులు చేపట్టాలని మంత్రి ఆదేశించినా నేటికీ ప్రగతి కనిపించడం లేదని విమర్శించారు.



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

• ఎస్సీ, ఎస్టీలకు ఎన్ని పథకాలు ఇచ్చారు?

గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు సంక్షేమ పథకాలు అందించలేదని నాడు ఆరోపించారని, కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలల పాలనలో ఎస్సీ, ఎస్టీలకు ఎన్ని సంక్షేమ పథకాలు అందించారని ప్రశ్నించారు. జీఓ 3, షెడ్యూల్ గ్రామాల ప్రకటనపై గిరిజన సంఘాలు ప్రశ్నిస్తున్నాయని, వారికి మంత్రి సంధ్యారాణి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో గిరిజన సంఘాల డిమాండ్ మేరకు ఐటీడీఏ డీడీలను మార్చి రెగ్యులర్ డీడీని నియమించడం జరిగిందన్నారు. కూటమి పాలనలో డీడీపై ఎటువంటి విచారణ జరుపకుండా సస్పెండ్ చేశారని, దీన్ని గిరిజన సంఘాలు ఖండించాయని వివరించారు. ఐటీడీఏలో రెగ్యులర్ పీఓల నియామకం చేపట్టాలని, గిరిజన శాఖకు చెందిన రెగ్యులర్ డీడీని ఎప్పుడు నియమిస్తారని ప్రశ్నించారు.

• పిచ్చోడి చేతిలో రాయిలా పాలన

నోట్లో బూరులు వండే మాదిరిగా మాటల గారడీలే తప్ప ఈ ప్రభుత్వంలో పనులు జరగడం లేదని ఎద్దేవా చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో హామీలు ఫుల్.. అమలు నిల్ అన్న చందాన, పిచ్చోడి చేతిలో రాయిలా పాలన సాగుతోందని దుయ్యబట్టారు. టీడీపీ కూటమి తెలిపిన సూపర్ సిక్స్ పథకాలతో పాటు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీల అమలు, ప్రజా సమస్యలపై గిరిజన, ప్రజా సంఘాలు, ప్రజలతో కలిసి పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు గిరి రఘు, గొర్లె వెంకటరమణ, సింగారపు ఈశ్వరరావు, దండి శ్రీనివాసరావు, మజ్జి అప్పారావు, రమణ, అబ్దుల్, రామకృష్ణ, హరిబాలాజీ పాల్గొన్నారు.

• శ్యామలాంబ పండుగకు ప్రజల నుంచి చందాలా..

పట్టణంలో శ్యామలాంబ పండుగ నిర్వహణకు సంబంధించి ప్రజల నుంచి చందాలు వసూలు చేస్తున్నట్లు పలువురు తన దృష్టికి తీసుకొచ్చారని రాజన్నదొర అన్నారు. అమ్మవారి పండగకు ప్రజల నుంచి చందాలు వసూలు చేసేకంటే ఎండోమెంట్, గిరిజన సంక్షేమశాఖ, జిల్లా కలెక్టర్ నుంచి అవసరమైన నిధులు తీసుకొచ్చి వాటితో పండగ జరుపవచ్చని అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వంలో ఈ పండుగ నిర్వహణపై జమిందారు, పెద్దలు తనతో చర్చించగా.. పండుగను ప్రకటించే అధికారం ఆలయ ధర్మకర్తలు, పెద్దలదేనని తాను చెప్పానని, పండుగ కోసం ఆర్థిక, మౌలిక వసతులు కల్పన, నిర్వహణ బాధ్యతలను మంత్రిగా తాను చూసుకుంటానని నాడు చెప్పానని గుర్తుచేశారు. కోవిడ్ తరువాత పూజారి ఇంట్లో సమస్యల కారణంగా గత ప్రభుత్వంలో పండుగ వాయిదా పడిందని వివరించారు. తాను మంత్రిగా పాడేరు మోదుకొండమ్మతల్లి పండుగకు రెండేళ్ల పాటు ఏడాదికి కోటి రూపాయలు చొప్పున రూ.2కోట్లు, శంబర పండుగకు రూ.50 లక్షల మంజూరు చేయించానని గుర్తుచేశారు.

రీసర్వే పక్కాగా చేపట్టాలి: జేసీ



రెవెన్యూ అధికారులకు సూచనలు చేస్తున్న జేసీ శోభిక

సీతానగరం: జిల్లాలో రీసర్వే పక్కాగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సీతానగరం మండలం వి.బుచ్చెంపేట గ్రామంలో రీసర్వే కోసం మంగళవారం నిర్వహించిన గ్రామసభను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం భూహక్కుదారుల పేర్లు, సర్వే నంబర్లలో ఉన్న భూవిస్తీర్ణం, తదితర వివరాలు సరిపోయాయా లేదా అని సరిచూసుకోవాలన్నారు. రెవెన్యూ రికార్డుల్లో, రైతుల పాసుపుస్తకాల్లో తప్పులు ఉన్నట్లయితే వాటిని సరిచేయాలని సూచించారు. ఈ క్రమంలో పలువురు రైతులు అందజేసిన దరఖాస్తులను ఆమె స్వీకరించారు. ఆమె వెంట పలువురు అధికారులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మాదకద్రవ్య రహిత సమాజమే శ్రేయస్కరం

సీతానగరం: ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని ఎస్‌ఐ ఎం.రాజేష్ పిలుపునిచ్చారు. స్థానిక ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఐ.ప్రసన్నలక్ష్మీ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మత్తుపదార్థాలకు బానిసైతే ఆరోగ్యం పాడవుతుందని, జీవితం నాశనమవుతుందని, కుటుంబాలు వీధిన పడతాయని అన్నారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ గ్రామాల్లోని ప్రజలకు దీనిపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి

- రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ



మాట్లాడుతున్న సూర్యనారాయణ

పార్వతీపురం: రైతు సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ కోరారు. పట్టణంలోని సుందరయ్య భవనంలో మంగళవారం రైతు సంఘ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని పథకాలకు గ్యారంటీ ఇస్తున్న ప్రభుత్వాలు రైతులు పండించిన పంటలకు గ్యారంటీ ఇవ్వలేకపోవడం దుర్మార్గమన్నారు. విజయవాడలోని బుడమేరు వరద బాధితుల్లో నష్టపోయిన కౌలు రైతులకు, కూలీలకు ఇంతవరకు పరిహారం ఇవ్వలేదన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ రైతు సమస్యల పట్ల చిత్తశుద్ధి లేకుండా ప్రభుత్వాలు పాలించడం శోచనీయమన్నారు. రైతు సమస్యల పరిష్కారం కోసం నవంబర్ 10న పార్వతీపురంలో జిల్లాస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు బంటు దాసు రెడ్డి లక్ష్మినాయుడు, గేదెల సత్యనారాయణ, పి.రాము, ఆర్.రమణమూర్తి, ఆర్.ఈశ్వరరావు తదితరులున్నారు.

ఇలా పట్టుకున్నారు.. అలా వదిలేశారు!

- అక్రమ ఇసుక రవాణా అడ్డుకోవడంలో రెవెన్యూ అధికారుల తీరు



రెవెన్యూ అధికారులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్



తహసీల్దార్ కార్యాలయం నుంచి ట్రాక్టర్‌ను తీసుకుని వెళ్లిపోతున్న దృశ్యం

సాలూరు: కంచే చేను మేస్తే అన్న చందాన మారింది పట్టణంలో రెవెన్యూ అధికారులు పరిస్థితి. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఉల్లంఘనలు చూస్తూ ఊరుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. నియోజకవర్గంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణాపై 'గంగమ్మతల్లికి గర్భశోకం' శీర్షికన మంగళవారం సాక్షి పత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు పాచిపెంట మండలం పాంచాలి గెడ్డ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఇంతవరకు బాగానే ఉంది. అయితే ఏమైందో తెలియదు గాని ఆ ట్రాక్టర్ కొద్దిసేపటి తరువాత తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో కనిపించలేదు. దాన్ని సంబంధిత యజమాని అక్కడ నుంచి దౌర్జన్యంగా తీసుకువెళ్లిపోయినట్లు తెలిసింది. అయినా దీనిపై అధికారులు కనీసం స్పందించలేదు. అందుకు కారణం ఆ ట్రాక్టర్ మంత్రి సంధ్యారాణి వర్గీయుడిది కావడమేనని స్థానికులు చర్చించుకుంటున్నారు. దీనిపై వివరణ కోరేందుకు తహసీల్దార్‌ను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు. ఆర్‌ఐ మౌలాళిని వివరణ కోరగా.. ట్రాక్టర్ పట్టుకున్నామని, తాము వీసీలో ఉన్నామని, తరువాత తహసీల్దార్‌కు తెలియజేస్తామని చెప్పారు. ఆ తరువాత ఆయన కూడా స్పందించలేదు. ఆ ట్రాక్టర్ టీడీపీ నేతది కావడంతో రాజకీయ ఒత్తిళ్ల మేరకు రెవెన్యూ అధికారులు ఉద్దేశపూర్వకంగానే దాన్ని విడిచిపెట్టేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా మండలంలో శివరాంపురం గ్రామంలో ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీకి చెందిన వ్యక్తి ట్రాక్టర్‌ను సీజ్ చేసి అత్యుత్సాహం చూపిన అధికారులు, టీడీపీ నాయకుడి ట్రాక్టర్‌ను పట్టుకుని మళ్లీ విడిచిపెట్టేయడం వారి తీరుకు అద్దం పడుతోంది. విషయం బయటకు రావడంతో సదరు టీడీపీ నేత తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తనదైన శైలిలో ప్రయత్నాలు చేయడం కనిపించింది.

ఉద్యోగాలకు 46 మంది ఎంపిక

సాలూరు: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 46 మంది ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. హెటిరో డ్రగ్స్, భారత్‌పే తదితర కంపెనీల్లో ఉద్యోగాలకు నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు 165 మంది హాజరు కాగా, 46 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సాయికృష్ణ చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

బడిదేవర కొండను పరిరక్షించుకోవాలి



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న రైతు సంఘ అధ్యక్షుడు కృష్ణమూర్తి, తదితరులు

పార్వతీపురం: బడిదేవర కొండపై మైనింగ్‌ను నిలుపుదల చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. బెలగాంలోని సుందరయ్య భవనంలో బడిదేవర కొండ మైనింగ్‌పై వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిదేవర కొండపై మైనింగ్ చేపడితే కార్పొరేట్ వ్యాపారులకు రూ.కోట్లలో లాభాలు వస్తాయని, దానిపైనే ఆధారపడి జీవిస్తున్న గిరిజనులకు, రైతులకు తీవ్ర నష్టం ఎదురవుతుందన్నారు. 2017లో ఈ ప్రాంతాన్ని రిజర్వ్ ఫారెస్టుగా నిర్ధారించిన ప్రభుత్వం రెవెన్యూ కొండగా ఎలా మార్పు చేసిందని ప్రశ్నించారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చేపడుతున్న ప్రయత్నాలు ముందుకు సాగనివ్వరాదన్నారు. భవిష్యత్ దృష్ట్యా బడిదేవర కొండ అక్రమ మైనింగ్‌ను నిలువరించేందుకు అంతా ఐక్యంగా పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు, గిరిజన సంఘ నాయకులు పి.రాము తదితరులున్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ బి.రవణమ్మ

సీతానగరం: మండల కేంద్రంలోని రౌండ్‌ది క్లాక్ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపీపీ, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ బి.రవణమ్మ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి ఉషా ఆధ్వర్యంలో మంగళవారం పీహెచ్‌సీ అభివృద్ధి సలహాకమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. రోగులకు నిరంతరం అత్యవసర వైద్యసేవలు అందించాలన్న సంకల్పంతో మండల కేంద్రంలోని ఆస్పత్రిని రౌండ్ ది క్లాక్ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడం జరిగిందన్నారు. పాముకాటు, కుక్కకాటు మందులు అందుబాటులో ఉంచాలని, రోగులకు పూర్తిస్థాయిలో మందులు, అవసరమైన వసతులు కల్పించాలని వైద్యులకు సూచించారు. సర్పంచ్ తేరేజమ్మ మాట్లాడుతూ.. పీహెచ్‌సీ అభివృద్ధికి అవసరమైన వనరులు సమకూర్చేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌ఓ ఎస్.వి.రమణ, మురళీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అండగా ఉంటాం

సాలూరు: అంగన్‌వాడీల సమస్యలపై పోరాడుతామని, వారికి అండగా ఉంటామని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు సిద్దాబత్తుల రామ చంద్రరావు అన్నారు. పట్టణంలోని వైటీసీలో మంగళవారం అంగన్‌వాడీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగ సంఘానికి అనుబంధంగా ఏఐటీయూసీ ఉంటుందని తెలిపారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. విధి నిర్వహణలో ఎటువంటి ఒత్తిళ్లు, వేధింపులు ఎదురైతే తమకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు బలగ రాధ, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలాం జీవితం స్ఫూర్తిదాయకం



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యువకులు

బలిజిపేట: అబ్దుల్ కలాం ఓ మహోన్నత వ్యక్తి అని, ఆయన జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు అన్నారు. మండలంలోని పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వద్ద మంగళవారం అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం భారతదేశానికి అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ప్రతీ విద్యార్థి కలాంను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో కె.గౌరీనాథ్, జి.శ్రావణ్‌కుమార్, ఎం.వెంకటేష్, సిహెచ్.అప్పలనాయుడు, ఎం.శ్రీను, పి.పరుశురాం, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

- ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

సీతానగరం: కూటమి ప్రభుత్వం గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మండలంలోని నిడగల్లు నుంచి ముత్యాలదొరవలస గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ ఆరుద్రమ్మ, మాజీ సర్పంచ్ జి.గంగమ్మతో కలిసి మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి ఉపాధి నిధులతో ఆయా పనులు చేపడుతున్నట్లు చెప్పారు. నిడగల్లు–ముత్యాలదొరవలస మధ్య రూ.2 కోట్లతో బీటీరోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. డిసెంబరు లోగా పనులు పూర్తిచేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.సత్యంనాయుడు, ఆర్.వేణునాయుడు, స్థానిక నాయకులు జి.తాతబాబు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు తలొగ్గితే చర్యలు తప్పవు



తాగునీటి సరఫరాపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈకి వివరణ కోరుతున్న ఎంపీపీ ప్రమీల

పాచిపెంట: అధికారులు, అధికార పార్టీ నాయకుల ప్రలోభాలకు తలొగ్గి చట్టాలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎంపీపీ బడ్నాన ప్రమీల అధికారులను హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా ప్రగతి నివేదికలను అధికారులు చదివి వినిపించారు. ముందుగా వ్యవసాయ శాఖపై చర్చ సమయంలో కొంతమంది సర్పంచ్‌లు మాట్లాడుతూ.. సబ్సిడీపై గిరిజన రైతులకు అందించే అపరాలు (రాగులు, జొన్నలు, పెసలు) వ్యవసాయశాఖ అధికారులు సకాలంలో అందించాలన్నారు. ఉపాధిహామీపై చర్చలో పలువురు సభ్యులు మాట్లాడుతూ.. తమకు తెలియకుండా, గ్రామసభ తీర్మానాలు లేకుండా అధికార టీడీపీ నాయకులు నిబంధనలకు విరుద్ధంగా ఉపాధి పనులు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్‌ల తీర్మానాలు లేకుండా పనులు ఎలా చేపడుతున్నారని ఎంపీపీ మండిపడ్డారు. చట్టాలు ఉల్లంఘిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. మండల కేంద్రంలో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, జలజీవన్ మిషన్(ఇంటింటి కుళాయిలు) పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఎంపీటీసీ దండి ఏడుకొండలు ప్రశ్నించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కొరశ్రన్ని సింహాచలం, ఎంపీడీఓ పాత్రో, తహసీల్దార్ డి.రవి, వైస్ ఎంపీపీలు కొరిపల్లి రవీంద్రనాథ్, మీసాల నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ జాబితాలు సరిచూసుకోవాలి

సీతానగరం: ఈ–క్రాప్‌లో నమోదు చేసిన పంటల వివరాలను రైతులు సరిచూసుకోవాలని, తప్పువు ఏమైనా ఉన్నట్లయితే వెంటనే సరిచేయించుకోవాలని ఏఓ ఎస్.అవినాష్ సూచించారు. మండలంలోని బూర్జ, నిడగల్లు గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తాము సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేయడం జరిగిందని, ఆ వివరాలతో కూడిన జాబితాలు ప్రస్తుతం ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. రైతులు వాటిని పరిశీలించి తప్పులు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అపరాల విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పుల సవరణకు సోషల్ ఆడిట్

బలిజిపేట: ఖరీఫ్ ఈ–క్రాప్‌లో తప్పుల సవరణకు చివరి అవకాశం సోషల్ ఆడిట్ అని ఏఓ శ్రావణ్‌కుమార్‌నాయుడు తెలిపారు. బర్లిలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ముసాయిదా జాబితాను చదివి వినిపించారు. ముసాయిదా జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అభ్యంతరాలను సవరించిన అనంతరం తుది జాబితాను ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏ చాందిని, సర్పంచ్ అప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు.

